# భయపడాల్సిన అవసరంలేదు..



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- కార్యకర్తలకు అండగా ఉంటా..
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్‌అర్బన్, డిసెంబర్ 6 : బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అన్ని వేళలా అండగా ఉంటానని, మీరు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరై మార్గనిర్దేశం చేశారు. నాయకులు, కార్యకర్తలు అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకునేలా ప్రవర్తించరాదన్నారు. కార్యకర్తలందరూ సంయమనం పాటించాలని సూచించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమేనన్నారు. మనం కరోనా సమయంలో కులమత భేదాలు లేకుండా ప్రజలందరికీ అన్ని విధాలా అండగా నిలిచామని గుర్తు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేశామని వివరించారు. ప్రతి కార్యకర్తకు, ప్రజలకు 24గంటలు అందుబాటులో ఉంటానని, ఏ సమయంలో ఆపద వచ్చి తన తలుపు తట్టినా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను త్వరలో పూర్తి చేయాలని లేనిచో తమ కార్యచరణ ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, ముడా చైర్మన్ గంజి వెంకన్న, గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, గొర్రెల కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతన్నయాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రహమాన్, వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, రవికుమార్‌తోపాటు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

### రాజ్యాంగ నిర్మాతకు నివాళి

పాలమూరు, డిసెంబర్ 6 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి అంబేద్కర్ అందించిన రాజ్యాంగం వల్లే అందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని, బడుగు బలహీన వర్గాల కోసం ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేశ్, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

# అందుబాటులో ఉంటా..



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

- ప్రజల తీర్పును గౌరవిస్తాం..
- నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 6 : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని, నాగర్‌కర్నూల్ ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటానని, ఎవరూ అధైర్య పడవద్దని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన బీఆర్‌ఎస్ శ్రేణులకు భరోసా కల్పించారు. నాగర్‌కర్నూల్ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అన్ని వేళల్లో అండగా ఉంటానని, తన ట్రస్ట్ ద్వారా చేపట్టిన సేవా కార్యక్రమాలైన మర్రి అన్న క్యాంటిన్, పెండ్లిళ్లు కానీ ఇంకా సేవా కార్యక్రమాలన్నింటినీ కొనసాగిస్తామని ప్రకటించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మర్రి మాట్లాడుతూ రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిపించి నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని ఎక్కడా వమ్ము చేయకుండా నియోజకవర్గంలోని ఏ మండలంలో ఏ ప్రాంతానికి ఏం కావాలి, ప్రజలు ఏం కోరుకుంటున్నారో వాటి పై దృష్టి పెట్టి పనుల పూర్తి చేశామన్నారు. రెండు పర్యాయాలు బీఆర్‌ఎస్‌కు అవకాశం ఇచ్చామని, కానీ ఈసారి కొత్త ప్రభుత్వానికి అవకాశం ఇవ్వాలని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు తీర్పు ఇచ్చారని, వారి తీర్పునకు కట్టుబడి కొత్త ప్రభుత్వానికి స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ప్రతిపక్ష హోదా ఇచ్చారని దానిని పూర్తిగా అంగీకరిస్తున్నామన్నారు. ఇప్పటికే రెండు పర్యాయాల బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నాగర్‌కర్నూల్‌ను జిల్లాగా ఏర్పాటు చేసి ప్రజలకు పరిపాలన చేరువ చేశామన్నారు. విద్య పరంగా మెడికల్ కళాశాల తీసుకువచ్చినట్లు చెప్పారు. పేదవారికి పెండ్లిళ్లు చేయడం, ఇరిగేషన్ ద్వారా రైతులకు నీటి సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. ఇంకా అనేక అభివృద్ధి కార్యక్రమాలను తమ ప్రభుత్వంలో చేసి ప్రజలకు చేరువయ్యామన్నారు. ఇంకా కొన్ని పనులు మిగిలి పోయాయని, వీటిలో ఇంజినీరింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ఉన్నాయన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు సైతం 90 శాతం పూర్తయ్యిందన్నారు. నాగర్‌కర్నూల్ ప్రాంతానికి ఇప్పటికే లక్షా 20 వేల ఎకరాలకు సాగునీటిని అందించామని, తిమ్మాజిపేట మండలానికి 40 నుంచి 50వేల ఎకరాలకు నీరు అందించాల్సి ఉందన్నారు. ఇందుకోసం నిరంతరం శ్రమించామని, ఎన్నో అవమానాలను సైతం ఎదుర్కొన్నామన్నారు. ఏది ఏమైనా సరే ప్రతిపక్షంలో ఉన్నా పాలమూరు–రంగారెడ్డిని పూర్తి చేసి నియోజకవర్గంలోని లక్షా 50 వేల ఎకరాలకు సాగునీటిని అందించడంలో తాను భాగస్వామిని అవుతానన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం, ఎమ్మెల్యేలు సైతం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గెలుపొందిన వారు పూర్తి అవగాహనకు వచ్చి అభివృద్ధిని కొనసాగిస్తారని ఆశిస్తున్నానన్నారు. తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని, ఆపే ప్రసక్తే లేదన్నారు. పదవులు వస్తూపోతూ ఉంటాయని, సేవ అనేది ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. మానవ సేవయే మాధవసేవ అనే నినాదంతో చేపట్టిన సేవా కార్యక్రమాలు గెలుపు ఓటములతో సంబంధం లేకుండా కొనసాగిస్తానన్నారు. అంతకు ముందు కార్యకర్తల సమావేశంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్‌యాదవ్, పార్టీ నాయకులు నాగం శశిధర్‌రెడ్డి, గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ హన్మంతురావు, ఎంపీపీలు నర్సింహారెడ్డి, మధు, నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పనాభాస్కర్‌గౌడ్, మార్కెట్ క మిటీ మాజీ చైర్మన్ కుర్మయ్య, అర్థం రవి, పాండుతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాతీర్పును శిరసావహిస్తాం : మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, డిసెంబర్ 6 : శాసనసభ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తామని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగానికి కట్టుబడి గెలుపోటములను సమానంగా స్వీకరిస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలిచి, తన కోసం అహర్నిశలు పనిచేసిన ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, తనకు ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు మూడుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిన నేపథ్యంలో అందరి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గంలో అభివృద్ధి చేశానని చెప్పారు. చిన్న వయస్సులోనే ముఖ్యమంత్రిగా ఎన్నికైన రేవంత్‌రెడ్డికి దేవుని ఆశీస్సులు ఉండాలని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఆరు గ్యారెంటీలతోపాటు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. తానూ అందరికీ అందుబాటులో ఉంటానని, బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల పక్షాన ముందుకు సాగాలని చెప్పారు. కార్యకర్తలు మనోధైర్యం కోల్పోకుండా పార్టీ కార్యక్రమాలను అనునిత్యం ముందుకు తీసుకెళ్తూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలకు అనుగుణంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.





బాదేపల్లి మార్కెట్‌లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని సంచుల్లో నింపిన వ్యాపారులు

# మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

- ఆర్‌ఎన్‌ఆర్ @ 3,219

జడ్చర్ల, డిసెంబర్ 6 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం ధాన్యం పెద్ద ఎత్తున చేరుకున్నది. కాగా ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యానికి అత్యధికంగా రూ.3,219ధర పలికింది. మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో ఆకాశం మేఘావృతమై ఉండడంతో చాలామంది రైతులు మార్కెట్‌కు ధాన్యం తీసుకురాలేదు. మధ్యాహ్నం తర్వాత వర్షం వచ్చేంతగా మబ్బులు కమ్ముకోవడంతో మార్కెట్‌లోని ధాన్యం కుప్పలపై రైతులు పాలిథిన్ కవర్లను కప్పుకున్నారు. మార్కెట్‌కు వరిధాన్యంతోపాటు మొక్కజొన్న, వేరుశనగ, పత్తి అమ్మకానికి వచ్చాయి. 7,756 క్వింటాళ్ల ఆర్‌ఎన్‌ఆర్ రకం అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.3,219, కనిష్ఠంగా రూ.1,219, మధ్యస్తంగా రూ.2,920 ధర పలికింది. అదేవిధంగా 108 క్వింటాళ్ల మొక్కజొన్న అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.2,343, కనిష్ఠంగా రూ.2,242, మధ్యస్తంగా రూ.2,343 ధర వచ్చింది. 247 క్వింటాళ్ల హంస రకం ధాన్యానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.1,860, సోన రకానికి రూ.2,874, వేరుశనగకు గరిష్ఠంగా రూ.6,161, పత్తికి గరిష్ఠంగా రూ.6,870ధర లభించినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

# జూరాలకు స్వల్పంగా వరద

ధరూరు, డిసెంబర్ 6 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్‌కు స్వల్పంగా వరద కొనసాగుతున్నది. జూరాల పైభాగంలోని నారాయణపూర్ నుంచి 1,645 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదు కాగా ప్రాజెక్టు నుంచి ఎడమ కాల్వకు 390 క్యూసెక్కులు, కుడి కాల్వకు 338క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 850 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్–2కు 851 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 8.126 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.419 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

### ఆర్డీఎస్ ఆనకట్టకూ కొనసాగుతున్న వరద

అయిజ, డిసెంబర్ 6 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద స్వల్పంగా కొనసాగుతున్నది. బుధవారం ఆర్డీఎస్ ఆనకట్టకు 290 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, ఆనకట్టపై నుంచి దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి 390 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 435 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.1 అడుగుల మేర నీటి మట్టం ఉన్నట్లు ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు. తుమ్మిళ్ల పథకం పంప్ ద్వారా నీటి విడుదల కొనసాగుతుందని పేర్కొన్నారు.

### టీబీ డ్యాంకు ..

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు వరద స్వల్పంగా కొనసాగుతున్నది. ఇన్‌ఫ్లో 610 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 2,319 క్యూసెక్కులు ఉంది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 12.976 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1633 అడుగుల గరిష్ఠ నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1592.21 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.



ఆర్డీఎస్ ఆనకట్టలో ప్రస్తుత నీటి మట్టం

# ఆల్ ఇండియా సౌత్‌జోన్ ఆర్చరీ జట్ల ఎంపికలు

పాలమూరు, డిసెంబర్ 6 : పాలమూరు విశ్వవిద్యాలయంలో బుధవారం ఆల్‌ఇండియా సౌత్‌జోన్ ఆర్చరీ జట్ల ఎంపికలు నిర్వహించినట్లు పీయూ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఆర్చరీ 50 మీటర్ల విభాగంలో ఆర్ సుజాత, ఎన్ విష్ణువర్ధన్ ఎన్నికయ్యారు. సెలక్ట్ అయిన విద్యార్థులు పంజాబ్‌లోని గురికాశి యూనివర్సిటీలో నిర్వహించే టోర్నీలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా గురువారం అథ్లెటిక్ పోటీలకు హ్యాండ్‌బాల్ ఎంపికలు స్త్రీ, పురుషులకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎంపికలకు పీయూ పరిధిలోని విద్యార్థులు సకాలంలో హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్చరీ కోచ్ రాంచందర్, శ్వేత, చంద్రకళ, పీడీలు మంజుల, విజయలక్ష్మితోపాటు విద్యార్థి, విద్యార్థులు పాల్గొన్నారు.